ప్రజాశక్తి

Vol. 2, no. 68

(Mar. 13, 1947)

బెజవాడ, 1947

Record no. 683

Prajāśakti

Vol. 2, no. 68

(Mar. 13, 1947)

Bejavāḍa, 1947

Record no. 683

Regd. No. 4486

4 పేజీలు అణా

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 2] బెజవాడ 13-3-47 గురువారం [సంచిక 38

మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసు కాల్పులు

ఒక ముస్లిం రైతు మరణం

హైదరాబాద్, మార్చి 11

నైజాం సంస్థానంలోని మహబూబ్‌నగర్ జిల్లాలో హిందూ - ముస్లిం రైతులపై పోలీసులు తుపాకులు కాల్చారు. ఫలితంగా మహమ్మద్ జహంగీర్ అనే రైతు చనిపోయాడు. ఆగ్రామంలో వసూలుచేసిన లెవీధాన్యాన్ని గ్రామస్థులకు రేషనుగా ఇయ్యకుండా లెక్కచేయక అధికారులు పోలీసుల సాయంతో పట్టడానికి వెడుతూండగా రైతులు అడ్డగించారనీ, పోలీసులు కాల్చారనీ తెలుస్తూంది.

గవర్నర్‌కు ప్రకాశంగారి రాజీనామా తంతి

పంజాబు మతకలహాలు గ్రామాలకు వ్యాపిస్తున్నాయి

విపరీతమైన ధన ప్రాణ నష్టం

కర్ఫ్యూ - మిలిటరీ - కాల్పులు

శాంతికమిటీల ప్రయత్నాలు

లాహోరు, మార్చి 11

బ్రిటిష్ కుట్రల ఫలితంగా, గవర్నర్ ఎత్తులమూలంగా పంజాబు నేడు ఘోర కలహాగ్నిలో మునిగిపోయింది. లీగుమంత్రి వర్గం ఏర్పడాలంటూ ఖిజర్ రాజీనామా ఇవ్వడంతో సిక్కు కాంగ్రెసు నాయకులు తీవ్ర అసమ్మతి తెల్పారు. ఉన్న కొయలిషన్ ప్రభుత్వం పోయింది. లీగు మంత్రివర్గం ఏర్పడలేదు. కేవలం బ్రిటిష్‌నిరంకుశపాలన 93 వ సెక్షన్ క్రింద తుపాకులతో రాజ్యం చేస్తున్నది.

కలహాలు, గ్రామాలకు వ్యాపిస్తున్నవి

పంజాబు రాష్ట్రంలోని రావల్పిండి, అమృతసర్, ముల్తాన్ పట్టణాలలో కొంత నెమ్మదించినప్పటికీ, పరిసర గ్రామాలలో రక్తపాతం ప్రారంభమైంది. ఖూనీలు, లూటీలు, తగులబెట్టడం సాగుతున్నది. మిలిటరీ స్వైరవిహారం చేస్తున్నది.

ముల్తాన్ చుట్టుప్రక్కల గ్రామాలలో అరాచకం ప్రబలింది. అటక్ జిల్లాలో చాల చోట్ల కొంపిడీలు, ఇళ్ళను తగులబెట్టడము జరుగుతున్నది. మిలిటరీ వెళ్ళింది.

అమృతసర్ దుస్థితి

అమృతసర్ పట్టణంలో ఇంతవరకు మత కలహాలలో ఆస్తి నష్టం 7 నుండి 10 కోట్ల వరకు ఉంటుందని మునిసిపల్ అధికారులు అంచనా వేశారు.

ఇంతవరకు 120 మంది చనిపోయారు 175 మంది గాయపడ్డారని అధికారుల అంచనా. చావులసంఖ్య ఇంకా స్పష్టం తేల లేదు. చాలబజారులు పోయాయి. అందులో కాత్రా జైమలసింగు వీధి అసలు ఊరుపేరు లేకుండా పోయింది. కాత్రా కనయాన్ వీధి దాంతాగారం బుగ్గి అయి పోయింది.

కొన్ని బజారులలో ఇప్పటికీ మంటలు కనిపిస్తున్నవి. ఈరోజు 4 గంటలసేపు కర్ఫ్యూ ఉత్తర్వు తొలగించారు. ఒకడు ఇంటికి నిప్పుపెడుతుండగా మిలిటరీ కాల్చి వేసింది. అమృతసరంతు కాల్చివేయబడింది. జిల్లాకలెక్టరు చావులసంఖ్య అధికారుల అంచనా కన్నా రెట్టింపు ఉంటుందన్నాడు, 100 దేశ్యగుడ్డలు కాల్చివేశారనికూడ అతను చెప్పాడు. ఇప్పుడు పట్టణంలో కొత్తకేసులు లేవు.

రావల్పిండి గ్రామాల్లో అరాచకం

రావల్పిండి ప్రక్కనున్న గ్రామాలలో మతకలహాలు తగ్గలేదు. రావల్పిండిలోకూడ రెండుచోట్ల ఇళ్ళకు నిప్పంటించారు. కలహాల్లో పాల్గొనేవారిని హెచ్చరించకుండా కాల్చివేయడానికి కలెక్టర్ మిలిటరీకి అధికార మిచ్చాడు. లూధియానాలో కర్ఫ్యూ అమలు జరుపబడింది.

పంజాబు గవర్నర్‌ను బర్తరఫ్ చేయాలి

సిక్కులసభలో తీర్మానం

ఈరోజు న్యూఢిల్లీలో సిక్కులసభ గురుద్వారసీస్‌గంజ్‌లో జరిగింది.

పంజాబు గవర్నర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి. ఆయనపై కోర్టులో విచారణ జరపాలి అని వారు తీర్మానించారు. పంజాబు హిందూ-సిక్కు బాధితుల యెడల సానుభూతిని తెల్పుతూ మరొకతీర్మానం కూడ సభలో ఆమోదించారు.

బలదేవ్‌సింగ్ రాక

సర్దార్ బలదేవసింగ్ (తాత్కాలిక ప్రభుత్వ సభ్యుడు) లాహోరుకు వచ్చాడు. శాంతి స్థాపనకోసం అన్ని మతాల నాయకులతో ఈయన సంప్రతిస్తారట. బాధితప్రాంతాలకు కూడ ఈయన వెడతారు.

జులుందర్ శాంతిసంఘం

జులుందర్‌లో అన్ని మతాల సభ్యులతో శాంతిసంఘం ఒకటి ఏర్పడింది. ఇక్కడ మొత్తం ఇంతవరకు కొట్లాటల్లో చనిపోయిన వారు 33 గ్గురు. తీవ్రంగా గాయపడ్డవారు 35 గురు.

పాకిస్తాన్ వ్యతిరేక దినోత్సవం

ఇక్కడ పాకిస్తాన్ వ్యతిరేక దినోత్సవం శాంతంగా జరిగింది. షాపులు చాలవరకు మూసివేశారు.

అలహాబాదు, కాన్పూరు, న్యూఢిల్లీ, బొంబాయి, సిమ్లా పట్టణాలలో సిక్కులు, కొందరు హిందువులు ఈ రోజు హర్తాళ్ చేసి ఈ దినోత్సవం జరిపారు.

కొయిలిషన్ ప్రభుత్వం ఏర్పడాలి

సోషలిస్టు నాయకుడు ముఫ్తీ అహ్మద్ పంజాబులో వెంటనే కొయిలిషన్ ప్రభుత్వం ఏర్పడాలంటూ ఇలా ప్రకటించాడు:

"అలాంటి కొయిలిషన్ ప్రభుత్వ స్థాపనకు పనిచేయవలసిందని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నాము. వందలఏండ్లుగా మనం కలిసిఉన్నాము. ఆ సామరస్యాన్ని సంరక్షించండి."

పంజాబు విభజన కూడదు

అహ్రార్ ముస్లిం ఖండన

మజ్లీస్ అహ్రార్ ప్రధానకార్యదర్శి నవాబ్జాదా నస్రుల్లాఖాన్ ఇలా ప్రకటించారు:

"కాంగ్రెస్ నిర్ణయం పూర్తిగా పరిస్థితిని మార్చివేసింది. పంజాబు, బెంగాలు రాష్ట్రాలలోని మైనారిటీలు కేవలం విభజనతోనే సంతృప్తిచెందుతారనుకుంటే హిందూ మెజారిటీ రాష్ట్రాలను కూడ మత ప్రాతిపదిక మీద విభజించడానికి కాంగ్రెస్ సిద్ధపడవలసి ఉంటుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ అర్థంచేసుకునేట్టు జాతీయముస్లింలు చెయ్యాలి.

"కేవలం పంజాబు, బెంగాలు విభజన ముస్లిం జాతీయగౌరవానికే సవాలు. అందుకు ముస్లింలు అంగీకరించరు."

చైనా సమస్యను చర్చకుతెచ్చినందుకు

కొమింటాంగు కంగారు

మాస్కో, మార్చి 11

విదేశాంగమంత్రుల సభ ఈవేళ మూడున్నర గంటలసేపు జరిగింది. చైనా సమస్యను కార్యక్రమంలో చేర్చడంగురించి చర్చించారు. 1945 లో జరిగిన బ్రిటన్, అమెరికా, సోవియటు మంత్రుల సభ 'విదేశాంగ మంత్రుల కౌన్సిల్' (బ్రిటన్, అమెరికా, సోవియటు, ఫ్రాన్సు, చైనా విదేశాంగ మంత్రులున్నది) సమావేశం కాదనీ, అదొక ప్రత్యేక సమావేశం మాత్రమేననీ బెవిన్ వాదించాడు. కాబట్టి, ఆ సమావేశ నిర్ణయాలను ఇప్పుడు కార్యక్రమంలో చేర్చకుండానే అనధికారరీత్యా చర్చిస్తే చాలునన్నాడు.

అమెరికా మంత్రి మార్షల్ ఈ వాదనను బలపరిచాడు. దీనికోసం అమెరికా, బ్రిటన్, సోవియటు మంత్రులు ప్రత్యేకంగా సమావేశమవాలన్నాడు.

ఫ్రాన్సు 1945 సమావేశంలో పాల్గొనలేదు. కాబట్టి ఇప్పటి చర్చల్లోకూడా పాల్గొనదని బిడాల్ అన్నాడు.

మాలొటావ్ ఇలా అన్నాడు: "1945 లో చర్చించిన రీతిగానే ఇప్పుడుకూడా చర్చించడానికి మా అభ్యంతరం ఏమీ లేదు. కాని, విదేశాంగమంత్రుల సభలోనే, అధికారరీత్యా చర్చించడానికి కూడా అవకాశం ఉండవనే మా అభిప్రాయం."

ఈ విషయాన్ని అనధికారరీత్యా చర్చించడానికే నిర్ణయించారు.

కొమింటాంగు చిందులు

చైనా సమస్యను సోవియటు చర్చకు తెస్తున్నందుకు కొమింటాంగు ప్రభుత్వం చిందులు తొక్కడం ప్రారంభించింది. మాలొటావ్ సూచన ప్రకటింపబడిన మరుక్షణంలోనే 'విదేశ ప్రభుత్వాలు జోక్యం కలిగించుకొంటున్నాయి' అంటూ ఈ అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం నాన్‌కింగు గోడల నిండా పోస్టర్లు అంటించింది.

ఆస్ట్రియా, జర్మనీలను గురించి చర్చించడానికి జరుగుతున్న యీ సమావేశంలో చైనా విషయం తేకూడదంటూ చైనా విదేశాంగ మంత్రి ప్రకటించాడు. అమెరికా మద్దతుతో తాము సాగిస్తున్న అంతర్యుద్ధ విధానం పూర్తిగా బట్టబయలవుతుందని వీరి కంగారు.

బెంగాలును విభజించాలట

కలకత్తా, మార్చి 7

బెంగాలును హిందూ-ముస్లిం రాష్ట్రాలుగా విభజించాలని కలకత్తా హైకోర్టులోని 50 మంది బారిష్టర్లు ఒక ప్రకటన చేశారు.

అసెంబ్లీసభ వాయిదా

మార్చి 21 కొత్తనాయకుని ఎన్నిక

అంతవరకు ఇప్పటి ప్రభుత్వమే వుంటుంది

మదరాసు, మార్చి 12

మదరాసు ప్రధాని ప్రకాశంగారు తమ పదవికి రాజీనామా ఇస్తూ గవర్నరుకు తంతి ద్వారా తెలియజేశారని రూఢిగా తెలుస్తున్నది. (గవర్నరు ఇప్పుడు చిత్తూరు జిల్లాలలో సంచారం చేస్తున్నాడు) ఇందుతోపాటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేయవలసిందని ప్రకాశంగారు కోరారు.

మదరాసుగవర్నర్ అసెంబ్లీని 15వ తేదీనాటికి వాయిదావేశాడు. ఈ రోజు మధ్యాహ్నం అసెంబ్లీ సమావేశంకాగానే స్పీకర్ సమావేశాన్ని వాయిదా వేశారని ప్రకటించాడు. ప్రతిపక్ష నాయకుడు మహమ్మద్ ఇస్మాయిల్ (లీగు) కొన్ని ప్రశ్నలు అడుగబోగా, సమావేశం వాయిదా వేయబడింది కాబట్టి ప్రశ్నలకు అవకాశంలేదని స్పీకర్ చెప్పాడు.

పార్టీ సమావేశం

నిన్నరాత్రి జరిగిన పార్టీ సమావేశంలో ఆచార్య కృపలానీ గవర్నర్ తిరిగి వస్తూనే (రేపు) ప్రకాశంగారు రాజీనామాను అందజేస్తారని ప్రకటించారు. పార్టీ సమావేశం రహస్యంగా జరిగింది. 130 మంది సభ్యులు హాజరయ్యారు.

కృపలానీ పార్టీలో ఐక్యత ఉండాలని గట్టిగా ఉద్బోధించారు. అన్ని గ్రూపులకు అంగీకారమైనరీతిగా మంత్రివర్గ నిర్మాణ సమస్యనుపరిష్కరించుకోవాలన్నారు. తాను వెంటనే తిరువాంకూరు వెళ్ళి తిరిగి 21 వ తేదీన జరిగే పార్టీ సమావేశంనాటికి వస్తానని, అప్పటికి ఒక సమాధానానికి రావలసిందని సభ్యులను హెచ్చరించారు.

కొత్త పార్టీనాయకుని ఎన్నిక జరపడం కోసం కాంగ్రెస్ అసెంబ్లీపార్టీ మార్చి 21 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమవుతుంది. సమావేశానికి ఆచార్య కృపలానీకూడ హాజరవుతాడు. అప్పటివరకు ఇప్పుడున్న మంత్రివర్గమే తాత్కాలికంగా పనిచేస్తుంది.

సామరస్య ప్రయత్నాల విఫలత

పార్టీలోని అన్ని గ్రూపులను ఐక్యపరచి, మంత్రివర్గం పునర్నిర్మించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు చాల ప్రయత్నం చేశాడు.

ప్రకాశంగారేమో ఏ రాజీకైనా తాను ప్రధానిగా ఉండాలని ప్రధానమైన షరతు పెడుతున్నాడు. ఇందుకు మిగత గ్రూపులకు చెందిన డాక్టర్ రాజన్, కామరాజ నాడర్, కళా వెంకట్రావుగారలు బొత్తిగా ఒప్పుకోలేదు. కొత్త మంత్రివర్గపట్టిక తేలనిది ప్రకాశంగారు గవర్నరుకు రాజీనామా ఇవ్వడానికి నిన్నటివరకు ఒప్పుకోలేదట. అదీగాక పార్టీనాయకుని ఎన్నిక నిర్ణీతపద్ధతిలో జరగాలని పట్టుబట్టారట.

ఇవన్నిటినిచూచి, తాను వెంటనే వెళ్ళిపోవాలి కాబట్టి కృపలానీ పార్టీసమావేశాన్ని 21 కి వాయిదా వేయించారు. ఈలోగా ఏ గ్రూపువారుగాని ఖండన మండనలు, తర్జన భర్జనలు పత్రికలద్వారాచేయరాదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదేశించారట. ఈపద్ధతికి నాడార్ మొదలైన అవిశ్వాసతీర్మాన ప్రతిపాదకులు అంగీకరించారు.

కృపలానీగారు ఈరోజు ఉదయం తిరువేంద్రం విమానంలో వెళ్ళారు.

కాంగ్రెస్ దిగిరాలేదు

క్వాజీ మహమ్మద్ ఈసా

కలకత్తా, మార్చి 11

ముస్లింలీగు వర్కింగుకమిటీ సభ్యుడు క్వాజీ ఈసా విద్యార్థులసభలో ఇలా ఉపన్యసించాడు:

"ఒకే కేంద్రప్రభుత్వం ఉండాలన్న అంశాన్ని, కేవలం రాజీ కుదుర్చుకోవాలన్న ఆదుర్దాతో మాత్రమే లీగు అంగీకరించింది. అయినప్పటికీ కాంగ్రెస్ రాజీకోసం ఏమీ దిగిరాలేదు. కాంగ్రెస్ తన మొదటి ప్రతిపాదననుండి దిగిరాలేదు. పాకిస్తాన్ కేవలం బేరం అనుకున్నది. పదికోట్లముస్లిముల ఆదర్శం పాకిస్తాన్ అని వారుగ్రహించాలి.

"స్వతంత్రంకంటె కాంగ్రెస్ అఖండ హిందూస్తాన్ ఆశయాన్ని ఎక్కువగా చూస్తున్నది. ముస్లింలీగు కేవలం స్వతంత్రాన్నే ఆశయంగా చూస్తున్నది."

కార్మికనాయకులపై కుట్రకేసు

పోటీ కూలీసంఘాన్ని అణచేటందుకై కుట్రచేశారట

మధుర, మార్చి 11

పోటీకూలీసంఘాన్ని అణచివేసేటందుకై హత్యలు, దోపిడులు, విధ్వంసాలుచేసి కుట్ర చేసేరనే నేరం కామ్రేడ్ పి. రామమూర్తి మొదలగు 34 గురు తమిళనాడు కమ్యూనిస్టుపార్టీ సభ్యులమీద మోపి, రిమాండులో వుంచారు. ఈ సందర్భంలోనే గత జనవరి 8 వ తేదీన మధుర, దిండిగల్ మద్రాస్ మొదలగు చోట్ల మూడుమందికి పైగా కార్మికనాయకులు అరెస్టు చేయబడినారు. వారిలో ముగ్గురిని (కామ్రేడ్ వెంకట్రామన్, బాలచంద్రమీనన్, బాలసుబ్రమణ్యం గార్లను) కుట్రకేసులో వదిలి, అర్డినెన్సు క్రింద అందరిని మరల అరెస్టుచేశారు. వీరుగాక మరి 7 గురిని వదిలిపెట్టారు.

మిగిలినవారందరిమీద వేరువేరు సెక్షన్ల క్రింద వేరువేరు కేసులు పెట్టారు.

ప్రజాశక్తి

1947 మార్చి 13 : గురువారం

కాంగ్రెసు అధ్యక్షుని కర్తవ్యం

మద్రాసు అసెంబ్లీ కాంగ్రెసుపార్టీలో ఏర్పడిన సంక్షోభాన్ని తొలగించడానికి, మంత్రివర్గతగాదాలనుపరిష్కరించడానికి కాంగ్రెసు అధ్యక్షుడు ఆచార్య కృపలానీ మద్రాసు వచ్చారు. ప్రధాని ప్రకాశం పంతులుగారు తమ మంత్రివర్గ రాజీనామాను కాంగ్రెసు అధ్యక్షుని చేతికి అందజేశారు. గవర్నరుకు కూడా రాజీనామా అందజేస్తూ టెలిగ్రామ్ ఇచ్చారు. తమపై విశ్వాసంలేదని ప్రకటించినవారిపై డిసిప్లినరీచర్య తీసుకోడానికిజరుపుతున్న విచారణ తతంగం మానుకొని, కాంగ్రెసుఅసెంబ్లీ పార్టీలోని శక్తులనుఅసెంబ్లీలోదాకాతీసుకుపోకుండా ఆఖరు నిమిషంలోనైనా ప్రకాశంగారిలా చేయడం సంతోషించదగినదే.

ఆచార్య. కృపలానీగారు కాంగ్రెసు పార్టీలోని అంతరంగిక కలహాలను పరిష్కరించాలి. తమనుఎన్నుకొన్న ప్రజల అభీష్టాలను తీర్చడానికి ఎన్నికల ప్రణాళికను అమలుజరపడానికి కాంగ్రెసుశాసన సభ్యులుకృషిచేసేలాగుచూడాలి. ప్రజలచే ఎన్నుకోబడిన కాంగ్రెసు మంత్రివర్గమే గాని, ఇదిఇంకా ప్రజామంత్రివర్గం కాలేదని కాంగ్రెసు వర్కర్ల మధ్యోపదిస్తూ కృపలానీగారుచెప్పారు. అందుచేమంత్రివర్గాలుప్రజాభీష్టాలను నెరవేర్చేలా చేయవలసినబాధ్యత కాంగ్రెసు అధ్యక్షునిపై వుంది. జమీందారులకు, దొంగ వ్యాపారులకు, లొంగిపోయి రైతు - కార్మికప్రజా వుద్యమాలను అణచడానికి తయారైన మంత్రివర్గపు దిగజారుడువిధానాన్ని అరికట్టాలి,కాంగ్రెసుమంత్రులు ప్రజామంత్రులుగావ్యవహరించేలాగ చేయాలి. అందుకొరకు క్రింది కార్యక్రమాన్ని వెంటనే అమలు జరిపేలాగు చూడాలి.

(1) అధికధరలవల్లకుటుంబపోషణే దుర్భరంగా వున్న కార్మికుల, ఉపాధ్యాయుల, ఉద్యోగుల జీతాలను సుఖజీవనోపాధికి అవుసరమైనంతవరకు పెంచాలి.

(2) రైతులు ఉత్పత్తిచేసే ధాన్యాదులకు న్యాయమైన ధరలను యివ్వాలి. బట్టలు, వ్యవసాయ పనిముట్లు వగైరా కంట్రోలురేట్లకురైతులకుఅందజేయాలి.

(3) జమీందారీ విధానాన్ని రద్దు చేస్తూ వెంటనే శాసనం జేయాలి.

(4) దొంగ వ్యాపారులను, లంచగొండులను కఠినంగా శిక్షించి ప్రజలందరకు జీవితావసర వస్తువులన్నీ కంట్రోలు రేట్లకు అందజేయాలి.

(5) బట్టలమిల్లులు వద్దని ఇదివరకు మంత్రివర్గం అనుసరించిన పాలసీని మార్చించాలి. బట్టలకరువును శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రత్తిపండే ప్రాంతాలలో బట్టలమిల్లులను, నూలు మిల్లులను నిర్మించాలి. చేనేత కార్మికులకు కంట్రోలు రేటుకు అవుసరమైనంత నూలును సప్లయిచేసి, ప్రస్తుతమున్న మిల్లుల్లో మూడుషిఫ్టులు ఏర్పాటుచేసి బట్టల ఉత్పత్తిని ఎక్కువచేయాలి.

(6) ఎన్నో యేండ్లుగా కాంగ్రెసు కావాలంటున్న వయోజన ఓటింగును వెంటనే మ్యునిసిపాలిటీలు, జిల్లాబోర్డులు వగైరా స్థానిక సంస్థలలో మంత్రివర్గం ప్రవేశపెట్టాలి. ప్రస్తుతం అసెంబ్లీలో వున్న లోకల్ బోర్డు బిల్లును అలా సవరించాలి.

(7) రౌలటు శాసనంలాంటి అతినిరంకుశమైన 'ప్రజారక్షణ బిల్లును' ఉపసంహరించుకోవాలి.

(8) ఈ నిరంకుశ ఆర్డినెన్సుక్రింద వారంటులేకుండా అరెస్టుచేయబడి, కేసు విచారణలేకుండా డిటెయిన్ చేయబడిన రాజకీయఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలి.

ఇవి కాంగ్రెసు అధ్యక్షుడు మద్రాసు కాంగ్రెసు అసెంబ్లీపార్టీచేత నిర్వర్తింపచేయవలసిన కనీసకర్తవ్యాలు. ఇవి వెంటనే అమలుజరిపినపుడే రాజాజీ కాంగ్రెసు మంత్రివర్గం ప్రజామంత్రివర్గపు ధర్మాన్ని నెరవేర్చినట్లవుతుంది. ఇందుకొరకు కాంగ్రెసు అధ్యక్షులు కృషి చేస్తారా? కాంగ్రెసు అధ్యక్షులు అలా కృషిచేసేటట్లు ప్రజాసంస్థలు ప్రజానాయకులు పూనుకోవాలి. ఈనాటి దుర్భర పరిస్థితుల నన్నిటినీ కాంగ్రెసు అధ్యక్షుని దృష్టికితేవాలి.

బందరు ప్రిన్సిపాల్ దారుణం

అరికట్టాలని కృష్ణాజిల్లా కమ్యూనిస్టు కమిటీ

బెజవాడ, మార్చి 10

కృష్ణాజిల్లా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి క్రింది ప్రకటన చేస్తున్నారు:

బందరు హిందూకాలేజి ప్రిన్సిపాల్ 100మంది విద్యార్థులనుపూర్తిగానూ 125మంది కొన్ని భాగాలలోనూ డిబారు చేశాడని, మొదటి మూడవ తరగతులలో మరికొందరిని డిబారు చేయడానికి పరీక్షలు కాకముందే లిస్టులు సిద్ధంచేసుకున్నాడనే వార్తలు వినవస్తున్నాయి. పరీక్షలకు కొద్దిరోజులుమాత్రమే వున్నాయి. ఇదిమధ్యలో 225 మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేయడానికి సాహసించాడు. వీరిలో కొందరు మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు వున్నారని విన్నప్పుడు ఈచర్య ఎంత దారుణమయినదో ప్రతివారికి స్పష్టమవుతుంది.

ఈ సంవత్సరం డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా బందరు విద్యార్థులు రెండుసార్లు సమ్మెచేశారు. డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు 10 సంవత్సరములనుండి ఎడతెగని ఆందోళన సాగిస్తున్నారు. ఎన్నికలలో కాంగ్రెసునాయకులు డిటెన్షన్ విధానాన్ని తొలగిస్తామని వాగ్దానాలుచేశారు. వారివాగ్దానాలు గంగలో కలిసిపోయాయి. విద్యార్థులు మాత్రం నిద్రపోకుండా తీవ్రంగా పోరాడుతూ వచ్చారు. విద్యాలయాధికారులు పోలీసుల సాయంతో ఈ పోరాటాలను క్రూరంగా అణచ ప్రయత్నించారు. బందరు ప్రిన్సిపాల్ అందరికంటె ఘనుడు. విద్యార్థులపై లాఠీచార్జీ చేయించి జైళ్ళలో కుక్కించాడు. కాని, మన ప్రజా మంత్రులు ప్రిన్సిపాల్ను వర్జిస్తుమాట అనకపోగా, కాలేజీని విద్యార్థులు స్వాధీనం చేసుకున్నారని ప్రధాని ప్రకాశంగారు ఆరోపించ డానికికూడా సాహసించారు.

జిల్లా కలెక్టరు చేసిన ఒడంబడికను కాలదన్ని 225 మంది విద్యార్థుల భవిష్యత్తును ధ్వంసం చేయుటకుప్రిన్సిపాల్ పూనుకున్నాడంటే, కారణం ప్రజా మంత్రులు యిచ్చిన అండను తప్ప మరేమీకాదు.

ఈ ప్రిన్సిపాల్ చరిత్ర తెలిసినవారెవ్వరినీ ఈనాటి వీరి క్రూరచర్యలు ఆశ్చర్యపరచవు. కాలేజీలో చీటికిమాటికి జరిమానాలు, పెనవి కదల్చితే బహిష్కరణ, సమ్మె చేస్తే పోలీసుల సాయంతో లాఠీచార్జీలు చేయించి, జైళ్ళలో పెట్టించుట పరిపాటిగా వస్తున్నది.

వీరి దుశ్చర్యలను ఆంధ్ర ప్రజానీకం సహించరాదు. ప్రధానికి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్కు, వెంటనే జోక్యం కలుగజేసుకుని, విద్యార్థుల జీవితాలను కాపాడాలని టెలిగ్రాములద్వారా తెలియజేయాలి. వివిధ ప్రాంతాలనుండి పెద్దలు ప్రిన్సిపాల్వద్దకు, కాలేజీ కమిటీవద్దకు వెళ్ళి ఈ దుర్మార్గాన్ని ఆపించాలి. విద్యార్థులందరూ విభేదాలను మరచి ఐక్యకంఠంతో యీ అన్యాయాలను అరికట్టడానికి ఆందోళన సాగించాలి.

విద్యార్థిపై డ్రిల్లుమాస్టరు దౌర్జన్యం

కడప, మార్చి 8

కడపజిల్లా విద్యార్థిఫెడరేషన్ ఆర్గనైజరు యం. యస్. నారాయణరెడ్డిగారు క్రింది ప్రకటన చేస్తున్నారు:

కడపజిల్లా జమ్మలమడుగు హైస్కూలులో 2 వారముల క్రితం నాలుగవ ఫారము విద్యార్థులు డ్రిల్ చేస్తూండగా డ్రిల్ మాస్టరు యల్. ఆర్. సుబ్బారెడ్డిగారు యం. ఈశ్వరయ్య అను విద్యార్థిని కాలిచెప్పుతో కొట్టినాడు. విద్యార్థులు యీ విషయం జిల్లా ఎడ్యుకేషనల్ఆఫీసరుగారికి తెలియపర్చారు. అది విచారణకు వచ్చినది. ఈ సంగతి తెలిసి డ్రిల్లుమాష్టరు విద్యార్థులను బెదరించి ఎట్లయినా దీనిని మాపుచేయాలని ప్రయత్నించు తున్నారు.

ఈ ఉపాధ్యాయుడే ఇదివరకు పిల్లలకు పుస్తకాలు, ఆటవస్తువులు బ్లాకు మార్కెటు ధరలకు అమ్మేవాడు. దీని విషయమై వెంటనే అధికారులు తగుచర్య తీసుకోవాలని విద్యార్థులు కోరుచున్నారు.

కలెక్టరువద్దకు మహిళల రాయబారం

జీవితావసర వస్తువులకొరకై

అవనిగడ్డ, మార్చి 5

ఈ రోజున సాయంకాలం 4 గంటలకు దివి తాలూకా మహిళాసంఘ ప్రతినిధులు 15 మంది (కోడూరు, నారేపాలెం, కొత్తపాలెం, అవనిగడ్డ గ్రామాలవారు) డిప్యూటీ కలెక్టరుగారివద్దకు రాయబారం వెళ్ళారు.

ప్రతి సంవత్సరానికి కనీసం 25 గజముల గుడ్డ కావాలనీ, తాలూకాలో ప్రతి 5 మైళ్ళకు ప్రసూతి సౌకర్యాలు కలిగించాలనీ, ప్రతి గ్రామంలోనూ మరుగుదొడ్లు కట్టించాలనీ, అగ్గిపెట్టెలు, కొబ్బరినూనె, వంటచెరకు, మందిమూనె వెంటనే సప్లయి చేయించాలనీ, ఆర్డినెన్సును రద్దుచేసి నాయకులను విడిచి పెట్టాలనీ కలెక్టరుకు తెలియజేశారు.

డిప్యూటీ కలెక్టరుగారు గుడ్డ అధికము చేయుట తనకు చేతగాని పనని, ప్రభుత్వంనే అడగమని చెప్పారు. అగ్గిపెట్టెలు, కొబ్బరినూనె, కట్టెలు వగైరాలకు జిల్లా కలెక్టరుకు వ్రాస్తాను. గవర్నమెంటు సహకార సంఘాలున్నచోట పై వస్తువులు దొరుకుతాయి. కాబట్టి మీరుకూడ వాటిలో చేరండి. ధరలు తగ్గించడం మాత్రం ఎవరితరమూ కాదు అని కలెక్టరు సమాధానం చెప్పారు.

గన్నవరం తాలూకా యువజన ప్రతినిధుల సమావేశం

గన్నవరంతాలూకా యువజన ప్రతినిధుల సమావేశం చినవోగిరాలలో మార్చి 19 వ తేదీ ఉదయం 8 గంటలకు జరుగును. గాన అన్ని గ్రామసంఘములు యెన్నికలు జరిపి డెలిగేట్లను పంపగోర్తాను అని అధ్యక్షుడు చింతపల్లి పాపారావుగారు ప్రకటిస్తున్నారు.

ఎస్టేటు రైతులకు ఇప్పటి బిల్లు నిరుపయోగం

గొల్లపల్లి, మార్చి 6

నిన్న మధ్యాహ్నం గొల్లపల్లి గ్రామంలో నూజివీడు తాలూకా రైతుసంఘ ప్రతినిధుల సమావేశం మాదల వెంకటప్పయ్యగారి అధ్యక్షతను జరిగింది.

"ప్రజారక్షణ" చట్టాన్ని వెంటనే రద్దు చేయాలనీ, డిటెన్యూలుగా వుంచబడిన రైతు నాయకుడు పండూరి ప్రసాదరావు, తదితర కార్మిక, రైతు, కమ్యూనిస్టు నాయకులను విడుదలచేయాలనీ, జమీందార్ల, మొఖాసాదార్ల, అగ్రహారందార్ల బాధలకు గురి అగుచున్న రైతాంగానికి సహాయపడి పౌరస్వాతంత్ర్య హక్కులను కాపాడాలనీ ప్రభుత్వాన్ని కోరుతూ సభలో తీర్మానించారు.

మంత్రివర్గం ప్రవేశపెట్టిన యెస్టేటు ల్యాండు రెవిన్యూ బిల్లువల్ల రైతుల ప్రధానసమస్యలు ఏమీ పరిష్కారంకావు. దేశంలో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చింది. జమీందార్లు యెస్టేట్లలో వున్న బంజరుభూములను పేద రైతు - కూలీలకు సాగుకు యివ్వకుండా అధికాహారోత్పత్తికి ఆటంకం కలుగచేయుచూ వచ్చారు. అరణ్యాలను, బంజరుభూములను దొంగరికార్డులు సృష్టించి అమ్ముకొంటున్నారు. అందుచేత రైతాంగానికి తీరనినష్టం, కష్టం కలుగుచున్నది. వీటినుండి రైతులకు ప్రభుత్వం రక్షణయివ్వాలి జమీందారీలను పరిహారం లేకుండా రద్దుచేయాలి. బిల్లుకు కనీసంఆంధ్ర రాష్ట్ర రైతుసంఘం సూచించిన సవరణలు చేర్చి యీనాందారీలకు కూడా వర్తింపచేయాలని తీర్మానించారు.

ఇంకా, దొంగవ్యాపారాన్ని అరికట్టవలసి నదిగానూ, పేదలకనగదరఖాస్తుపీరియల్ మణుగు రు 2-0-0 లు వుండాలనీ, ధాన్యంధరలను బస్తా ఫుటివద్దనే ముతకలు రు 11-0-0 చేయాలనీ, జొన్నలు రు 22-0-0 వుండాలని జమీందారులు హామీకిస్తులు, బకాయీలు వసూలు చేసేటట్లు ప్రభుత్వం ప్రకటన చేయాలని తీర్మానాలు చేయబడినవి.

నూతన సంవత్సరమునకు శ్రీ మాదల వెంకటప్పయ్యగార్ని అధ్యక్షులుగానూ, చలపాని రాజగోపాలంగారిని ఉపాధ్యక్షులుగాను,పొట్లూరు వీరరాఘవయ్యగార్ని ప్రధానకార్యదర్శిగాను, అక్కినేని గోపాలకృష్ణయ్య కోగంటి వెంకటేశ్వరరావులను సహాయ కార్యదర్శులుగాను మరిఅరుగురినికార్యవర్గంగాను ఎన్నుకున్నారు.

సాముదాయక భూములలోని తుమ్మల అమ్మకం

మునగాల రైతుల ప్రతిఘటన

మునగాల, మార్చి 6

మునగాల జమీందారు చెరువు పడకంలోని తుమ్మచెట్లను విరివిగాఅమ్ముట ప్రారంభించాడు. ఈ తుమ్మచెట్లు అమ్మితే రైతుల వ్యవసాయ పరికరాలకు కరువు వస్తుంది. ఈ ప్రమాదాన్ని గుర్తించి మునగాల రైతుసంఘం సాముదాయక భూములలోని చెట్లను రక్షించుకోవాలని రైతులకు పిలుపు యిచ్చింది.

జమీందారునౌకర్లు కలకోవగ్రామంలోను, కోదండరామపురం గ్రామంలోను, తుమ్మలను కొట్టించుటకు వచ్చారు. ఈ గ్రామాల రైతులు ఐక్యతతో జమీందారు వుద్యోగులను తుమ్మలను కొట్టవద్దని, తుమ్మలను కొట్టిన తమ వ్యవసాయం కుంటుపడుతుందని, తాము కొట్టనీయమని చెప్పారు. జమీందారు తొత్తులు కొట్టెదమని హంగామా చేశారు. రైతులు ఈ హంగామాకు లెక్కచేయక ప్రతిఘటించారు. రైతుల ఐక్యత చూచి జమీందారునౌకర్లు కాలికిబుద్ధిచెప్పారు. మునగాల రైతుసంఘం సాముదాయకభూములలోని చెట్లను జమీందారు అమ్మకుండా తగు చర్య తీసుకోవలసినదిగా జిల్లాకలెక్టరు గారికి మదరాసు ప్రభుత్వానికి తెలియపరిచింది.

మునగాల బాటనే ముక్త్యాలకూడ

నందిగామ, మార్చి 6

జయంతి, దాచవరం, కంచల, చింతలపాడు, చెర్వుకొమ్ముపాలెం గ్రామాలలోని చెరువులను ముక్త్యాల జమీందారు దొంగరికార్డు సృష్టించి ధాన్యపేర పెట్టి స్వంతకమతం అని నాటక మాడుతున్నారు. ఇంతవరకు ఏ చెరువుకు చిల్లిగవ్వ పెట్టి మరమ్మతు చేయించలేదు. ఎస్టేటు బిల్లు రాలేదు. అయినవరకు వడుపుకుందామని చెరువులలోని తుమ్మలు బేరాలు పెడుతున్నారు. కాన ప్రభుత్వం ఈ తుమ్మల అమ్మకాన్ని ఆపుచేయించాలి. తుమ్మలనెవరూ కొనవద్దని విజ్ఞప్తి చేస్తున్నానని నందిగామ తాలూకా రైతుసంఘాధ్యక్షులు పీరమాచనేని వెంకటేశ్వరరావుగారు ప్రకటిస్తున్నారు.

మునేయేరు కాల్వ పూడిగించాలి

నందిగామ, మార్చి 6

నందిగామతాలూకా రైతుసంఘాధ్యక్షులు పీరమాచనేని వెంకటేశ్వరరావుగారిలా వ్రాస్తున్నారు.

మునియేరు కాల్వను పూడిగించితే సోమవరం, రుద్రవరం, గోళ్ళమూడి, తుమ్మలపాలెం, రాఘవాపురం, వల్లగిరి గ్రామాల భూములు 2,000 యకరాలు సాగులోకి వస్తాయి. ఈ స్కీముమగూర్చిన వివరాలన్నీ సేకరించబడి ఎస్టిమేట్సుకూడ తయారు చేయబడ్డవి. 1944 లోనే పని పూర్తిచేయించుతామని సోమవరం, రుద్రవరం రైతులనుండి తమ భూములు సాగులోకి తెచ్చేందుకు వాగ్దానం తీసుకొన్నారు. పోలంపల్లెవద్ద కాల్వ మొగలో నీరు యెక్కువ వచ్చేందుకు 8000 రూపాయల పని 1944 లోనే చేయించారు. కాని యింతచేసి, ఈ 3 సంవత్సరాలనుండి కాల్వను పూడిగించే విషయం అదిగో, యిదిగో అని కాలహరణం చేస్తున్నారు. గత డిశంబరులో ఎస్టిమేట్సు చీఫ్ యింజనీరు ఆఫీసులో పరిశీలింపబడుతున్నవని సమాధానం వచ్చింది.

పరిశీలనలతోను, పరీక్షలతోనే పుణ్యకాలం కాస్తా గడచిపోయేటట్లుంది. ప్రజామంత్రివర్గం కదలి ఈసంవత్సరం బడ్జెటులోనైనా ఈ స్కీమును చేర్చి వెంటనే పని ప్రారంభించాలని కోరుతున్నాను.

రాష్ట్ర ఉపాధ్యాయ ఆ. క. సమావేశం

ఆంధ్రరాష్ట్ర ప్రాథమికోపాధ్యాయ అర్గనైజింగ్ కమిటీ సమావేశం మార్చి 16 వ తేదీన బెజవాడలో రామమోహన్ గ్రంథాలయములో ఉదయం గం. 8 లకు జరుగును.

వేరుశనగపిండి ఎగుమతి ఆపాలి

గుంటూరు, మార్చి 10

గుంటూరుజిల్లానుండి 6000 టన్నుల వేరుశనగపిండి మలబారు జిల్లాకు ఎగుమతి చేశారు. ఈ ఎగుమతివల్ల జిల్లా రైతులు అసమ్మతి తెలియజేశారు. యీ పద్ధతి మానుకోమని కోరితే అధికార్లు "మీకు తెలియదులే లెక్కల ప్రకారం మీజిల్లా మిగులు ప్రాంతంలే" అని మొండిగా సమాధానంచెప్పారు.

కాని చివరకు వేరుశనగపిండి కనీసంగా కావలసినంతకూడా దొరకక జిల్లా రైతులు నానా అవస్థలపడ్డారు. లోపీ వున్నపల్లెలైనా సకాలంలో సక్రమపంపకం జరగలేదు. యే ప్రాంతంలో రైతుకు యెప్పుడు అవసరమో వివక్షలేకుండా డిపోలకు సరఫరా చేయటం, డిపోలకు వచ్చిన తర్వాతగూడా యింకా ఆర్డర్లురాలేదంటూ ఆలస్యంచేయటం, జరిగింది. ఉదాహరణకు 1946 పిండి సీజనులో డిపార్టుమెంటువారివద్ద గోతాలు అయిపోయినవి. రైతులువెళ్ళి "మేం గోతాలు తెచ్చుకుంటాం ఎరువులివ్వండి" అంటే, అమ్మ పెట్టదూ, అడుక్కుతిననివ్వదూ అన్నట్లు "మావద్ద గోతాలులేవు. మీ గోతాలతో యివ్వటానికి మా 'రూల్సు' వప్పుకోవు" అని ఒక నెలపర్యంతమూ వరకు డిపోలలోనే మురగపెట్టి రైతులను నానా యిబ్బందుల పాలుచేశారు.

ఈ సంవత్సరం అధికవర్షాలవల్ల వేరుశనగపంటలు నాల్గోవంతుకు పైగా దెబ్బతిన్నదిగనుక, వేరుశనగపిండి వుత్పత్తి విపరీతంగాతగ్గుతుందని ప్రతివారికీ తెలుసు. పైగా యీ సంవత్సరం 11000 టన్నులు ఎగుమతి చేయటానికి నిశ్చయించారు. పదిరోజుల క్రిందటనే 1000 టన్నులు ఎగుమతి అయింది. మిగతాది ఎగుమతిచేయటానికి వాగెన్లు దొరక్క తహతహలాడుతున్నారు.

రామన్న యీ విషమ పరిస్థితిని రైతులు, ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వంవారు వెంటనే జోక్యం కలిగించుకొని జిల్లా రైతాంగానికి నష్టదాయమైన యీ ఎగుమతుల నాపాలి. జిల్లాలో ప్రస్తుతమున్న డిపోలను ఎక్కువచేసి, సకాలంలో రైతుకు పిండి అందేటట్లు చేయాలి.

జిల్లాలో రైతాంగం, పర్మిట్లమీద వారికి యెక్కడ వీలైతే అక్కడనుండే తెచ్చుకునే సౌకర్యం కల్పించాలి.

ఈహక్కులు సాధించేవరకు రైతులంతా తీవ్ర ఆందోళన చేయాలని గుంటూరు జిల్లా రైతుసంఘ సహాయ కార్యదర్శి డి. వి. అప్పారావుగారు వ్రాస్తున్నారు.

ధాన్యం ఎగుమతివల్ల కూలీలకు నిరుద్యోగం

పెదన, మార్చి 10

రాష్ట్ర ఫ్యాక్టరీవర్కర్సు యూనియన్ సహాయకార్యదర్శి, తుమ్మల సూర్యనారాయణరావుగారు క్రిందిప్రకటన చేస్తున్నారు:

ప్రస్తుతం జీవితావసర వస్తువులధరలు విపరీతంగా వున్నవి. ఫ్యాక్టరీకార్మికులకు వుద్యోగం గ్యారంటీలేదు. యీ సంవత్సరం సీజనులోకూడా మిల్లులలో పనులు సరిగా లేవు. కార్మికులు నికృష్టజీవితం గడుపవలసి వస్తూవుంది.

ఈ పరిస్థితులలో మద్రాసు ప్రభుత్వం కృష్ణాజిల్లానుంచి మలబారుకు 80000 బస్తాలు ధాన్యంయెగుమతి చేసింది. ఈ ధాన్యం యెగుమతులవల్లవున్న కొద్దిపనికూడాపోయి, ఫ్యాక్టరీకార్మికులు నిరుద్యోగానికి పాల్పడవలసివచ్చింది. ప్రభుత్వంతలపెట్టిన ధాన్యం యెగుమతులు ఆపుచేసి, బియ్యంగా యెగుమతిచేస్తే యిచ్చట కార్మికులకు పనిగల్గుతుంది.

అంతేకాకుండా రవాణాకు వ్యాగెన్లు ఎక్కువ కావలసి వస్తూ వున్నవి. అందువల్ల రవాణాఛార్జీలు ఎక్కువ అవుతున్నవి. దిగుమతి చేసుకొనేచోట ప్రజలు ఎక్కువధరలు యిచ్చుకోవలసి వస్తుంది, బియ్యంగా యెగుమతిచేస్తే, వ్యాగెన్లు, రవాణాఛార్జీలు తక్కువ అవుతాయి. ఇచ్చట కార్మికులకుకూడా పని గల్గుతుంది. కాబట్టి ప్రభుత్వం బియ్యంగానే యెగుమతిచేయాలని, ఫ్యాక్టరీ కార్మికులంతా ఆందోళనచేయాలని కోరుతూవున్నాను.

ఇరిగేషన్ సమస్యలపై రైతులలో ప్రచారం

గుడివాడతాలూకా రైతుసంఘ కృషి

గుడివాడ, మార్చి 3

గుడివాడతాలూకా రైతుసంఘ జనరల్బాడీ సమావేశం యీనెల 2 వ తేదీన పాములపాడులో జరిగింది. శ్రీ వంగపాటి రంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు.

కార్యదర్శి బొప్పన వెంకటేశ్వరరావుగారు సాంవత్సరిక నివేదిక చదివారు.

కాంగ్రెసు మంత్రివర్గాలు రైతుకొరకు చేయవలసిన శాసనాలనుగురించి తాలూకా రైతుసంఘంతరపున యాత్రాదళాలు తాలూకా అంతా తిరిగి 10 వేలమంది రైతు కూలీల మధ్య ప్రచారం చేయబడిందని నివేదికలో తెలిపారు. ఇంకా యిలా వ్రాసారు. "ఆహార సమస్యను పరిష్కరించడమే ప్రధాన ఆశయంగా పెట్టుకొని ఐక్య ఆహార కమిటీల నేర్పరచడానికి కృషి చేసింది. కాని ప్రయోజనం లేకపోయింది.

"బుడమేటి రైతాంగాన్నంతా సమీకరించి తాలూకా రైతుసంఘం బుడమేటి రైతుమహాసభ జయప్రదంగా జరిపింది. అన్నిపక్షాలతో కూడిన బుడమేటికమిటీని వేసి కాంగ్రెసు మంత్రులవద్దకు రాయబారం పంపింది.

"జిల్లా యినాం రైతుమహాసభజరిపి తాలూకాలోని 32 యీనాంగ్రామాలనుండి రైతాంగాన్ని సమీకరించింది. బట్లకోడు, మామిళ్ళకోడు రైతులసభ జరపడంలో ప్రధానపాత్ర వహించింది.

"చిన్న చిన్న యిరిగేషన్, మురుగు సమస్యలను పరిష్కరించడంలో తీవ్రకృషి చేసింది.

రైతుసమస్యలన్నిటిపైన అన్ని రాజకీయ పక్షాలను సమీకరించి ఐక్య రైతుఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేసింది.

"రైతు - కూలీ సామరస్యాన్ని సాధించడానికి, వ్యవసాయ కూలీలకు అన్నివిధాల సహాయపడింది. నాము పద్ధతి పోగొట్టడానికి 19 గ్రామాలలో వ్యవసాయ కూలీలకు వడ్డీ లేకుండా అప్పులిప్పించింది. ధనిక రైతులకు వ్యవసాయ కూలీలకు వచ్చిన ఘర్షణలలో కూలీల తరపున నిలబడింది." రిపోర్టును సభ్యులంతా ఆమోదించారు.

అట్లీ ప్రకటన దేశంలో చెలరేగిన ప్రజోద్యమాలనుదెబ్బకొట్టడానికేఉద్దేశించబడిందనీ అన్ని రాజకీయపార్టీలు కలసి స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధపడాలనీ సభతో తీర్మానం చేశారు.

ధాన్యంధర బస్తా రు11-0-0కనీసరేటుగా చేయాలని, దానికనుగుణ్యంగా జీవితావసర వస్తువులను కంట్రోలుపెట్టి, స్టాకులను కంట్రోలుచేసి, బ్లాకుమార్కెట్టుఅరికడుతూ ప్రజానీకానికి అందజేయాలని మంత్రివర్గాన్ని కోరుతూ పై కోర్కెలను సాధించుకునేవరకు రైతాంగంనిరంతరాందోళనచేయాలని మరొక తీర్మానంచేయబడింది.

బుడమేరు ప్రాజక్టు నిర్మాణం ఆరంభిస్తారా?

బెజవాడ, మార్చి 9

అభివృద్ధిశాఖవారు బెజవాడ ఫిర్కాలో గృహపరిశ్రమల కార్యాలయాన్ని తెరిచారు. మొన్న 7 వ తేదీన దీని ప్రారంభోత్సవం కృష్ణాజిల్లా కలెక్టరు యస్. యస్. మణిగారి అధ్యక్షతను జరిగింది.

మణిగారు ఉపన్యసిస్తూ గ్రామ పునర్నిర్మాణానికి ఎన్నుకున్న ఫిర్కాలలో కలుగజేసే సౌకర్యాలను వివరించారు. ఫిర్కా అభివృద్ధి కార్యంగా బుడమేరు ప్రాజక్టు నిర్మాణం వెంటనే సాగించే వుద్దేశం ఉందన్నారు. బుడమేరు ప్రాజక్టువల్ల జిల్లారైతులకు, ముఖ్యంగా కైకలూరుతాలూకాకు చాలా లాభిస్తుందని చెప్పారు. కొల్లేరు మురుగు పోయేందుకు కూడ ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తుందని అన్నారు.

ఈ సంవత్సరం బడ్జెటులో ఇర్రిగేషను సౌకర్యాలక్రింద బుడమేరుస్కీముకుసొమ్ము ప్రత్యేకించబడలేదు. పోతే కలెక్టరుగారి ప్రసంగంవల్ల బెజవాడ ఫిర్కా అభివృద్ధి కార్యక్రమంలో ఒకభాగంగా పై స్కీము పూర్తిచేస్తారని తెలుస్తోంది.

ప్రభుత్వం దొంగవ్యాపారం అరికట్టి ప్రజల బాధలను తొలగించాలి

మదనపల్లె, మార్చి 4

బత్తలాపురం రేషన్ డిపో డీలరు టి. రెడ్డెప్ప ఆహార కమిటి అధ్యక్షుడుగా కూడా వున్నాడు. మార్చి రెండవతేదీన ఒడ్డి చిన్నప్ప అనునతనికి 30 సేర్ల బియ్యం కూపన్ లేకుండా బ్లాకులో రూపాయికి రెండు సేర్ల ప్రకారం అమ్మినాడు. గ్రామ తలారి చూచి ఆహార కమిటీ సభ్యులకు తెలియజేశారు. వారు పట్టుకొని రివెన్యూ ఇనస్పెక్టరుకు రిపోర్టు జేశారు. గ్రామ మునసబు బియ్యాన్నిస్వాధీనపర్చుకొన్నారు. పై అధికార్లు వెంటనే ఇతనిపై కేసు పెట్టవలయునని పి. రామానుజంగారు వ్రాస్తున్నారు.

ఎనిమిదిబండ్ల దొంగ వేరుశనగనూనె

శ్రీకాకుళం, మార్చి 7

8 వ తేదీ రాత్రి ఇచ్చాపురం వర్తకులు ఎనిమిది బండ్లలో వేరుశనగనూనె ఒరిస్సా రాష్ట్రానికి యెగుమతి చేస్తున్నారు. ఇచ్చాపురం సర్కిలు ఇన్స్పెక్టరు ఆ బండ్లను పట్టుకొని శ్రీకాకుళం అడిషనల్ సస్టుకాను మేజిస్ట్రేటు దగ్గర వారిని హాజరు పెడితే రిమాండులో వుంచారు.

అగ్గిపెట్టెల దొంగవ్యాపారం

కొండపల్లి, మార్చి 9

కొండపల్లిగ్రామానికి అగ్గిపెట్టెలు ఈసారి కోటా 840 డజన్లు వచ్చాయి. కోటాదార్లు గ్రామంలోవున్న 14 కిల్లీకొట్లకు ఒక్కొకరికి 12 డజన్లు మాత్రం యిచ్చి మిగిలినవన్నీ బ్లాకుమార్కెట్టు చేస్తున్నారు.

7-3-47 రాత్రి కలపరాయి సుబ్బారావు అండ్ రాఘవయ్య కంపెనీవారిదగ్గర షేక్ బుడెన్ అనేవారు ఒక్కగ్రోసు అగ్గిపెట్టెలు తీసుకుపోతూంటే మహమ్మద్ ఖాసిం అనే యువకుడు పట్టుకొని పోలీసులకు అప్పగించాడు.

8-3-47 రాత్రి గుడిపాటి అంజయ్యగారి కొట్లో గంగినేని నాగయ్యరు 3 డజన్లు కొని తీసుకుపోతూండగా మహమ్మద్ ఖాసిం పట్టుకున్నారు.

అగ్గిపెట్టెలు దొరకక ప్రజలు పలుబాధలు పడుతూంటే వ్యాపారస్తులు బాహాటంగా దొంగవ్యాపారం సాగిస్తున్నారు. ఆహార కమిటీలు, పై అధికార్లు ఈ దొంగవ్యాపారాన్ని అరికట్టి అగ్గిపెట్టెలు ప్రజలకు అందజేయాలని పి. ధర్మారావుగారు వ్రాస్తున్నారు.

అగ్గిపెట్టెలు కొబ్బరినూనెకరువు

కొయ్యగూరపాడు, మార్చి 10

అగ్గిపెట్టెలు, మంచినూనె, కొబ్బరినూనెలు దొరకక ముఖ్యంగా పేదరైతులు, వ్యవసాయకూలీలు అవస్థలు పడుతున్నారు. కొబ్బరినూనె వీశె రు. 8 లు, వేరుశనగనూనె రు 2 లు స్థానికవర్తకులు అమ్ముతున్నారు. అదయినా అందరికీ యివ్వడం లేదు. కలవాళ్ళు ఏధరఅయినా కొనుక్కుంటున్నారు. లేనివాళ్ళకు ఏధరకూ దొరకటం లేదు.

వడ్లమూడి గ్రామంలో దొంగ ధాన్యం

గుంటూరు, మార్చి 7

28-2-47 సాయంత్రం 6 గంటలకు తెనాలి తాలూకా వడ్లమూడిగ్రామంలో వాశిరెడ్డి వెంకట క్రిష్ణయ్య, దేవరపల్లి వెంకట నరసయ్య, వాశిరెడ్డి వీరయ్యగార్ల యిండ్లకు డి. యస్. ఆర్. జి. ఫిర్కా సప్లయింగు ఆఫీసరు (అనందరావు) గుంటూరు సబ్ యిన్స్పెక్టరుగార్లు వెళ్ళి సోదాచేయగా వాశిరెడ్డి వెంకట క్రిష్ణయ్యగారి యింట్లో 81 వడ్ల బస్తాలు పట్టుబడినవి. వెంకటక్రిష్ణయ్యగారిని ధాన్యం ఎవరిని అని అడగగా సంజాయిషీ గ్రామ కాపురస్థుడైన వాశిరెడ్డి వెంకట సుబ్బయ్యగారిని అని స్టేటుమెంటు యిచ్చినారు. దేవరపల్లి వెంకట నరసయ్యగారి యింట్లో 34 ధాన్యంబస్తాలు,వాశిరెడ్డి వీరయ్యగారి యింట్లో 17 బస్తాలు ధాన్యం పట్టుబడినవి. వారు యిద్దరు మాత్రం యీ ధాన్యం మాదిగావు అని స్టేటుమెంటు యిచ్చినారు. ఈ మొత్తం 82 బస్తాలు ఆగ్రామ మునసబుగారి స్వాధీనం చేశారు. ఈ విషయం గుంటూరు జిల్లా కలెక్టరుగారికి పిటీషను ద్వారా తెలియజేయడమైనది.

ఈ కేసును లేకుండా చేసికొనుటకు వాశిరెడ్డి వెంకట సుబ్బయ్య విశ్వప్రయత్నం జేస్తూవున్నాడు. ప్రభుత్వవారు వెంటనే కలుగజేసుకొని యీయనమీద తగు చర్య తీసుకోవలసిందిగా కోరుతూ అన్నమరెడ్డి వెంకటరెడ్డిగారు వ్రాస్తున్నారు.

292 బస్తాల తవుడు పట్టుకున్నారు

దుగ్గిరాల, మార్చి 7

2-3-47 వ తేదీన దుగ్గిరాల 1వ వార్డులో 292 బస్తాలు తవుడు పట్టుకొని దుగ్గిరాల ఫిర్కా సహకార సంఘంవారికి, గ్రామ ఆహారకమిటీవారికి రిపోర్టు చేశారు. గాన క్రయ విక్రయ సహకార సంఘాల ద్వారా తవుడు కావలసిన ప్రజలకు అందజేయాలని జె. వి. కృష్ణగారు వ్రాస్తున్నారు.

'తొలిలడుసు' పత్రికా నిధికి సాయపడండి

[illegible], మార్చి [illegible]

మద్రాసు ప్రభుత్వం దక్షిణాది రైల్వే లేబర్ యూనియన్ పత్రిక [illegible] పత్రికకు మూడు [illegible] యిలు ధరావతుకోరిన విషయం [illegible] విదితమే. దక్షిణాది రైల్వే ([illegible]) కార్మికుల వీరోచిత పోరాట[illegible] లకు వేరే జ్ఞప్తికి తేనక్కరలేదు. [illegible] వారంలో 3 వేల రూపాయలు [illegible] చెల్లించాలి. 7 వ తేదీకి [illegible] 1600 రూపాయలు మాత్రమే [illegible] కార్మికుల ఆయుధమైన ఈ పత్రిక[illegible] దానికి కార్మికులు ముఖ్యంగా [illegible] కులు, ఇతర అభిమానులు ఉదారం[illegible] లిచ్చి తమ సౌభ్రాతృత్వాన్ని [illegible] ఐక్యతను తెలియజేయగోరుతున్నా[illegible] కాయ యస్. ఐ. రైల్వే లేబర్ యూనియన్ కార్యదర్శి పేరిట గోల్డెన్ రాక్ కు పంపండి.

—ఆంధ్రరాష్ట్ర ట్రేడ్ యూనియన్ [illegible]

ప్రజాశక్తి చందా వివరాలు

సంవత్సరం చందా	రు. 24[illegible]
విడిపత్రిక	0[illegible]
వారపత్రిక సం॥ చందా	9[illegible]
వారపత్రిక	0[illegible]

కమ్యూనిస్టుపార్టీ నిధికి ఆంధ్ర ప్రజల కానుకలు

* * *

ముంగండ

మార్చి 6 వ తేదీన ముంగండ గ్రామములో కామ్రేడ్ చెరుకూరి సీతారామశాస్త్రిగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. సభలో కమ్యూనిస్టుపార్టీకి విరాళాలు ఇవ్వవలసిందిగా విజ్ఞప్తిచేయగా చేనేత కార్మికుడు కునుమె చినవీరాస్వామిగారు రెండు రూపాయలు ఇచ్చారు. వరెళ్ళచిట్టి వెంకన్న అనే కార్మికుడు పార్టీనిధికి తనవంతు అర్ధ రూపాయను ఉత్సాహంతో చెల్లించారు. ఈ కార్మికుని ఉత్సాహం చూచి సభలో చదివింపులు ప్రారంభమయాయి. మామిడిశెట్టి చంద్రన్న రు.2లు, వీరశెట్టి రు. 2 లు, రాజగోపాలం ఒకరూపాయ, వరెళ్ళ వెంకటస్వామి ఒక రూపాయ, శ్రీమతి గొడవర్తి శేషమ్మ రూపాయి యిచ్చారు.

బందరు

బందరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ యమ్. శ్రీహరిరావుగారు తమ కార్యాలయానికి యిప్పటివరకూ, యీ క్రిందివిధంగా విరాళాలు చేరినాయని తెలుపుతున్నారు.

వడ్డి చన్నయ్య	10 0 0
వడ్డి సుబ్బయ్య	5 0 0
వడ్డి క్రిష్ణారావు	5 0 0
డి. సత్యనారాయణ	10 0 0
వడ్డి రంగారావు	10 0 0
కాగితం సుబ్బారావు	10 0 0
పినపాల నాగభూషణం	5 0 0
ఒక లాయరు	50 0 0
ఒక యింజనీరు	15 0 0
ఇన్స్యూరెన్సు గుమస్తా	5 0 0
ఒక సూపర్వైజరు	5 0 0
ఉమా వెంకటరత్నం	1 0 0
	131 0 0

నందిగామ

చింతలపాడు పార్టీసభ్యులు జొన్నకోటద్వారా	30 0 0
చెర్వుకొమ్ముపాలెం	100 0 0
శివరాత్రికి కూడలిలో వసూళ్లు	29 12 0
కనగపాడు	100 0 0
నందిగామ విద్యార్థులు	200 0 0
ఆఫీసులో వసూళ్ళు	15 14 0
గుమ్మడిదుర్రు	101 0 0

వీరులపాడు	10 [illegible]
	596 [illegible]

కైకలూరు

పార్టీకార్యాలయానికి ఈ క్రిందివిధంగా వసూళ్లు చేరాయని ఆఫీసుకార్యదర్శి వ్రాస్తున్నారు:

శీతనపల్లి	60 [illegible]
పోడుకొండ	50 [illegible]

చిరివాడ

చిరివాడనుండి కామ్రేడ్ విశ్వనాథం మరికొన్ని పార్టీనిధి వసూళ్ళు తెలియజేస్తున్నారు:

కంభం ఆదినారాయణ	10 [illegible]
నక్కా బసవయ్య	10 [illegible]
ఆత్కూరు చినవెంకటేశ్వర్లు	10 [illegible]
బోడి వెంకయ్య	10 [illegible]
ఆత్కూరు సోమయ్య	5 [illegible]
బోడి రామయ్య	5 [illegible]
ఎర్రబోయిన క్రిష్ణమూర్తి	5 [illegible]
ఆత్కూరు బసవయ్య	5 [illegible]

పాలకొల్లు

నాట్యమండలిద్వారా వసూళ్లు	20 [illegible]

మాజీసైనిక సభలు

నూజివీడు

నూజివీడుతాలూకా మాజీ సైనికుల మహాసభ 16-3-47 మధ్యాహ్నం 2-30 గం॥ నూజివీడులో జరుగుతుంది.

గుడివాడ

గుడివాడ తాలూకా మాజీ సైనికుల మహాసభ గుడివాడలో 16-3-47 న మధ్యాహ్నం జరుగుతుంది.

రాజమండ్రి

రాజమండ్రి తాలూకా మాజీ సైనికుల మహాసభ 16-3-47 మధ్యాహ్నం 11 గం॥ లకు రాజమండ్రి పట్టణ విద్యార్థి సంఘ ఆఫీసులో (ఇన్నిసుపేట) జరుగుతుంది.

పెదన

బందరు తాలూకా మాజీ సైనికుల మహాసభ పెదనలో 23-3-47 మధ్యాహ్నం 3 గం॥ లకు జరుగుతుంది.

పొలాల నాక్రమింపజూసే జమీందారుకు దేహశుద్ధి

రౌడీలకు, ప్రజాపీడకులకు ప్రాయశ్చిత్తం

తెలంగాణా ప్రజల ప్రతిఘటన

భువనగిరి, మార్చి 1

వడిమటి సీతారాంపురం గ్రామం భువనగిరి తాలూకాలోనిది. దాని జమీందారు జాగిర్దారు వెంకట్రామరావు. ఈయనకు వెయ్యి ఎకరాల పట్టావుంది. మదివడిగె గ్రామంలో ముస్తాజరు ఇతనిదే. ఎక్కువభాగం కౌల్దార్లు, రైతులనుండి ప్రతిఫలం విపరీతంగా గుంజుతున్నాడు. యుద్ధానికి పూర్వం ఎకరాకు కౌలు రు16-0-0లు వుండే ఇప్పుడు 60-0-0లదాకా పెరిగాయి. ఇవ్వలేమన్న రైతులభూమిని ఈ జమీందారు గుంజివేసి కొన్ని తరతరాల సేద్యపు హక్కున్నరైతులను ఎందరినో వెళ్ళగొట్టేవారు. వెట్టి చేయించుకోవడంలో, లంచాలు గుంజడంలో ఇవగాం జమీందారుకు తీసిపోడు.

ప్రజలంతా సంఘంలో చేరి ఐక్యబలం ప్రదర్శించడంతోనే జమీందారుగారి జోరు మూలపడింది. తాబా చేయా ఆడలేదు. తరతరాలుగా ప్రజలు సేద్యం చేసే భూమిని దురాక్రమణ గావించననీ, లంచాలు పుచ్చుకోననీ ఇతడు ప్రజలకు క్షమాపణ చెప్పుకొన్నాడు.

ముఖ్య గ్రామాలన్నిటిపైన నిరంకుశ ప్రభుత్వం మిలిటరీ క్యాంపులు పెట్టేసరికి ఇలాంటి పీడకులకు మళ్ళీ క్రొత్త ఉత్సాహం వచ్చింది. జమీందారు వెంకట్రామరావు ప్రజలమీద పెత్తనం నిర్బంధించసాగాడు. భూములను వదలిపెట్టవలసిందని ఒత్తిడిచేయ ప్రారంభించాడు.

మదివడిగె గ్రామంలో ఇతని ఏజెంట్లయిన సర్దార్లు, ప్రభుత్వం గ్రామంపై రు 1500 జరిమానా వేసిందని ప్రచారం చేశారు. వసూళ్ళకు ప్రజలను నిర్బంధించ పోయారు. కాని నిజంగా యీ గ్రామంపై జరిమానా లేదు. ప్రజలు డబ్బు ఈయమని నిరాకరించారు. అపైన జమీందారు రైతులను భూములనుండి తొలగించడానికి పూనుకున్నాడు. కొందరి పొలాలలో ఎరువుమట్టి తోలించడం ప్రారంభించాడు. కౌలుదార్లు జమీందారు దుర్మార్గాన్ని ప్రతిఘటించారు. బండ్లను ఆపివేశారు. జమీందారు పోట్లాటకు సిద్ధమయ్యారు, తమపై దౌర్జన్యానికి పూనుకున్న జమీందారుకు, అతని మనుష్యులకు కౌలుదార్లు దేహశుద్ధి జరిపారు.

దేశముఖ్ పలాయనం

హుజూర్‌నగర్, మార్చి 1

హుజూర్‌నగర్ తాలూకా దాచవరంలో తడకమళ్ళ లక్ష్మీకాంతరావ్ అనే దేశముఖ్ ఉన్నాడు. ఇతని దౌర్జన్యాలను, దోపిడీని ఎదిరించడానికి ఆ గ్రామ ప్రజలు సంఘం (ఆంధ్ర మహాసభ)లో చేరారు. ప్రజల సంఘటిత శక్తిని చూచి భయపడి ఇతడు పారిపోయాడు. మూడునెలలుగా మిర్యాలగూడెంలో కాపురం పెట్టాడు. సైనికులను పిలిపించి ప్రజలను భయపెట్టజూచాడు. కాని ప్రజలు జంకలేదు.

తమనుండి దేశముఖ్ లాక్కొన్న రెండువందల ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకొనుటకు రైతులు సిద్ధపడినారు. 700 ఎకరాలు పాడుబడివున్న బీడును వ్యవసాయకూలీలు సేద్యం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ పరిస్థితులలో 10-2-47 న దేశముఖ్ కొందరి రౌడీలను ప్రోగుచేసుకొని, ఆయుధాలిచ్చి, స్వయంగా ఈ గ్రామానికి వచ్చాడు. మొదట ప్రజలలో చీలికలు కల్పించి తర్వాత రౌడీలతో దాడి చేయాలని తలచాడు. కాని లాభం లేకపోయింది. ప్రజలు ఆత్మరక్షణకు సిద్ధం కాగానే తన రౌడీలతోసహా పలాయనం చిత్తగించాడు. సమీప గ్రామమైన సోమవరంలో అతడు మకాం వేశాడు. అక్కడ్నుంచి రౌడీలను పంపి దాడి చేయించుటకు సన్నాహాలు చేస్తున్నాడు. కాని గ్రామ వాసులు వారికి బుద్ధిచెప్పటానికి సిద్ధంగానే వున్నారు.

రౌడీలకు ప్రాయశ్చిత్తం

సూర్యాపేట, మార్చి 1

సూర్యాపేట తాలూకా రాగిపాడులో అబ్బాస్ అలీ అనే రౌడీవున్నాడు. ఇతని దురంతాలు ప్రజాశక్తి పాఠకులకు విదితమే. ఇతని తమ్ముడు మన్సూర్ అలీ, గ్రామానికి పట్వారి (కరణం) వీరిద్దరూ గ్రామ ప్రజలనుండి వేనకువేలు గుంజేవాళ్ళు. కాని ఇక్కడ ఆంధ్రమహాసభ ఏర్పడుటతో వీరి ఆటలు కట్టాయి. అందుచే మిలిటరీని ఆగ్రామాన్ని అణచడానికని రప్పించారు. కాని వీరి దౌర్జన్యాలను ప్రజలంతా ఎదుర్కొంటూనేవున్నారు. ఆంధ్రమహాసభ నాయకులను పట్టియాలని ఇతను ప్రయత్నిస్తున్నాడు. పోలీసులతో ప్రజలను బెదరించాలని ఇతగాడి ప్రయత్నం.

20—2—47 న సూర్యాపేటనుండి పోలీసు ఇనస్పెక్టర్‌ను పిలిపించాడు. అతడు రాగిపాడు రాగానే, ప్రజలను సంఘాన్ని అబ్బాసాలీ, అతని తొత్తుగా ఒక దాకలీ, తిట్టపోగారు. అబ్బాసాలీని పూర్తిగా ప్రజలు బహిష్కరించినందువల్ల సూర్యాపేటనుండి ప్రత్యేకంగా అతడు ఒక చాకలిని తెచ్చుకొన్నాడు. ప్రజలను తిట్టింది ఇతనే. పోలీసు ఇనస్పెక్టరుముందే ప్రజలు అబ్బాసాలీని, చాకలిని మందలించారు. ఏమాత్రం జడియకుండావున్న ప్రజలనుచూచి పోలీసు ఇనస్పెక్టరు సూర్యాపేటకు వెళ్ళిపోయాడు. అబ్బాస్‌అలీకి, అతని తొత్తుకు ప్రజలు తగువిధంగా బుద్ధిచెప్పారు. అబ్బాస్‌అలీ తిరిగి గ్రామాలపై దాడిచేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

బకింగ్‌హామ్‌మిల్లు కార్మికుల సమ్మె

బోనసు, కరువుభత్యంకోరారు

మద్రాసు, మార్చి 11

బకింగ్‌హాం, కర్నాటక్ మిల్లుల కార్మికులు 14000 మంది నేటి ఉదయంనుండి సమ్మె ప్రారంభించారు. 6 నెలల బోనసు, ఎక్కువ కరువుభత్యం, ఉద్యోగ సౌకర్యాలు మొదలగు 21 కోరికలతో వారు సమ్మె నోటీసునిచ్చారు. ఆఖరునిమిషంలో మద్రాసు ప్రభుత్వం కార్మికుల 14 కోరికలనుమాత్రం విచారించడానికంటూ ఒక కోర్టు ఆఫ్ ఎంక్వయిరీని నియమించారు. ఎంక్వయిరీకని అక్కరలేని వేళాం గనక సమ్మెచేస్తే ఆర్డర్‌ని ఒక ప్రకటనకూడా చేశారు.

ప్రభుత్వంనియమించిన విచారణ కేవలం కాలహరణకొరకే ఎత్తుమాత్రమేనని కార్మికులు దానిని నిరాకరించి సమ్మె ప్రారంభించారు.

ఉపాధ్యాయుల సమ్మె

సి. పి. లో 17 మంది అరెస్టు

రెండు వారాల నుండి మధ్య రాష్ట్రాలలో ప్రాథమికోపాధ్యాయులు సమ్మెచేస్తున్నారు. 10వతేదీన 17 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు అసెంబ్లీముందు తమ కష్టాలు చెప్పుకొనేటందుకై వెడుతూండగా, ఊరేగింపులను నిషేధిస్తూ మాజిస్ట్రేటు జారీచేసిన ఆజ్ఞను ధిక్కరించారని నేరం మోపి వారిని అరెస్టు చేశారు. కోర్టులో ఒకరిని విడిచిపెట్టారు. 16 మందికి (వారిలో 3 గురు స్త్రీలు) వెంటనే విడిషైదు, 40 రూపాయలు జరిమానా లేక మరియొక వారం శైదు విధించారు.

బెల్జియంలో ప్రభుత్వ ప్రతిష్టంభన

ప్రజాక్షేమకరమైన ధరల కంట్రోలు ఉండాలని కమ్యూనిస్టుల పట్టుదల

బ్రస్సెల్సు మార్చి 11

బెల్జియంలో మితవాద-సోషలిస్టు-కమ్యూనిస్టుపార్టీల సంయుక్త మంత్రివర్గం ఉంది. ఈ మధ్య ధరల కంట్రోలు విషయంలో కమ్యూనిస్టులకు, మితవాదులకు అభిప్రాయ భేదాలు వచ్చాయి. ప్రజా సామాన్యానికి సౌకర్యంగా ఉండే విధానాన్ని కమ్యూనిస్టులు సూచించారు. దానిని మితవాదులు వ్యతిరేకించారు పైగా వర్తకులపై తమ పలుకు బడినిఉపయోగించి నిన్న సమ్మె చేయించారు.

మితవాదుల ఈ పంథాపట్ల అసమ్మతిని సూచిస్తూ మంత్రివర్గంలోని నలుగురు కమ్యూనిస్టులు ఈవేళ రాజీనామానిచ్చారు.

ప్రధాని కామిల్లి హ్యూస్మాన్ రివమంత్రి వర్గం అంతటి రాజీనామాను రేపు రీజెంటుకు అందజేస్తాడని అనుకుంటున్నారు.

హంగరీలో కుట్రదారులపై చర్య తీసుకొన్నందుకు

అమెరికా ఆగ్రహం

వాషింగ్టన్, మార్చి 11

హంగరీ అంతరంగిక విషయాల్లో నిదేశాల జోక్యం కలిగించుకోడానికి సిద్ధేసు అంటూ సోవియటు ప్రభుత్వం ఊసేనల అమెరికా రాసిన ఒక జాబుకు జవాబు పంపింది.

హంగరీలో నియంతృత్వ ప్రభుత్వాన్ని తిరిగి స్థాపించడానికి జరుగుతూన్న ఒక పెద్ద కుట్ర ఇటీవల బయటపడింది. వెనుకటి డిక్టేటరయిన అడ్మిరల్ హార్తి అనుచరులు విదేశాల్లో ఉండి, విదేశీ ధనసహాయంతో ఈ కుట్రను నడుపుతున్నారని వెల్లడయింది. మొన్నటి ఎన్నికల్లో ప్రథమ పార్టీగా నెగ్గిన 'భూస్వాముల పార్టీ' నాయకుల్లో కొందరు దీనిలో ప్రధానపాత్ర నిర్వహిస్తున్నట్లుకూడా స్పష్టమయింది. ఈ పార్టీ సభ్యులయిన దేశరక్షణ, ఆర్థిక,వ్యవసాయశాఖల మంత్రులూ, మొన్నటివరకు ఈ పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన బెలా కోవాక్సు, మరి 50 మంది ముఖ్యులూ ఈ కుట్రలో ఉన్నారని రుజువయింది. వీరిని వెంటనే పార్టీలోనుంచి తొలగించి శిక్షించాలనీ, పార్టీలో బాగా తనిఖీచేసి, ఇలాంటి ద్రోహులింకెవరయినా ఉంటే తొలగించాలనీ కోరుతూ కమ్యూనిస్టుపార్టీలు తీవ్ర ఆందోళన ప్రారంభించాయి.

ఈలోగా, బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు కమ్యూనిస్టులు హంగరీలో అధికారంకోసం ప్రాకులాడుతున్నారని విషప్రచారం సాగించాయి. ఈ ప్రచారాన్ని ఆసరాగా తీసుకొని 'భూస్వాముల పార్టీ' నాయకుడయిన ప్రధాన మంత్రి కమ్యూనిస్టు సోషలిస్టుపార్టీల సూచనను నిరాకరించాడు.

ఇది ఇలా ఉండగా, దేశంలోఉన్న సోవియటు సేనలకు అపాయకరమైన పనులు బెలాకోవాక్సు తలపెట్టినట్లు బయటపడింది. సోవియటు అధికారులు వెంటనే అతనిని అరెస్టుచేశారు. దానిపై అమెరికా ప్రభుత్వం సోవియటుకొక జాబుపంపింది. సోవియటు అధికారులచర్య అక్రమమనీ, హంగరీ పరిస్థితులను గురించి సంయుక్త విచారణకు అంగీకరించాలని రాసింది.

హంగరీలోని సోవియటుఅధికారి, బెలాకోవాక్సు అరెస్టుకుకారణాలనువివరిస్తూ జవాబు రాశాడు. సంయుక్తవిచారణ జరపడం హంగరీ అంతరంగిక విషయాల్లో విదేశాల జోక్యంకలిగించుకోవడం అవుతుంది— సోవియటు అందుకు ఎన్నటికీ అంగీకరించదని స్పష్టంగాఇరాశాడు.

హంగరీలో ఇప్పటి శాసనసభను రద్దుచేసి, తిరిగి ఎన్నికలు జరిపించాలన్న ఆందోళన రోజురోజుకూ పెరుగుతూంది.

కమ్యూనిస్టులపై ఫ్రెంచి కన్సర్వేటివ్‌ల అపవాదులు

పారిస్, మార్చి 11

ఇండోచైనాను గురించి చర్చించడానికి ఫ్రెంచి అసెంబ్లీ ఈవేళ సమావేశమయింది. ఇండోచైనాలో దురాక్రమణయుద్ధాన్ని అంతమొందించేలా చేయడానికి కమ్యూనిస్టుపార్టీ నిశ్చయించుకుంది. ఆ యుద్ధానికి అంతరాయం లేకుండా చేసుకోవాలని అభివృద్ధి నిరోధకుల ఎత్తు. ఆ ఉద్దేశంతో, సమావేశం మొదలుకాగానే కరడుగట్టిన అభివృద్ధి నిరోధక పార్టీ అయిన 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ లిబర్టీ' సభ్యుడు ఆంద్రీ లేచి కమ్యూనిస్టుపార్టీని నానాదుర్భాషలాడడం ప్రారంభించాడు.

ఈ అసందర్భపు మాటలను కట్టిపెట్టి అసలు విషయాన్ని గురించి మాట్లాడమని అధ్యక్షుడు హెరియట్ ఎన్నోసార్లు హెచ్చరించాడు. అయినా లక్ష్యపెట్టకుండా ఆంద్రీ తన ధోరణిసాగించి, చివరకు కమ్యూనిస్టు పార్టీనాయకుడూ, ఉపప్రధానీ అయిన థోరేను "ఫ్రెంచి సేనలోనుంచి పారిపోయిన పిరికిపంద" అనితిట్టాడు. "దేశభక్తియుతకర్తవ్యం నన్నెక్కడుండాలని నిర్దేశించిందో అక్కడే నేనా రోజుల్లో ఉన్నాను." అని థోరే జవాబు చెప్పాడు. నీచమైన ఆ ఆరోపణను ఉపసంహరించుకోవలసిందని కమ్యూనిస్టు సభ్యులు కోరారు. అభివృద్ధి నిరోధకులు పెద్దగోల ప్రారంభించారు. అధ్యక్షుడు సభను వాయిదా వేయవలసివచ్చింది.

బయటకు వెళ్ళిన తరువాతకూడా ఆంద్రీ తన తిట్లు మానలేదు. అప్పుడు ఒక కమ్యూనిస్టుసభ్యురాలు రెండు చెంపకాయలు తీసి బుద్ధిచెప్పింది. కొంతసేపటికి ఘర్షణ తగ్గింది.

సమావేశాన్ని తిరిగి ప్రారంభించారు. నాజీ ఆక్రమణకాలంలో ఆంద్రీ జర్మన్లతో ఎలా చేతులు కలిపాడో ఒకరు బట్టబయలు చేశారు. ఒక యూదు ఆస్తిని జర్మన్లు వశపరచుకొని వేలం వేయగా ఆంద్రీకొన్నాడు. దానితో ఆంద్రీ గోల ప్రారంభించాడు. అధ్యక్షుడు సభను గురువారంనాటికి వాయిదా వేశాడు.

[యుద్ధకాలంలో ఫ్రాన్సులోని అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు కమ్యూనిస్టులపై వేట సాగించాయి. యుద్ధరంగంలో జర్మన్లను ప్రతిఘటిస్తూ పోరాడుతున్న వారిని కూడా అరెస్టుచేసి హింసించనారంభించాయి. మొదట్లో థోరే సైనికుడుగా చేరాడు, కాని, దేశాన్ని నాజీ హిట్లరుకు అమ్మ తలపెట్టిన వీరి కుట్రల నెదిరించడానికి ఆయన, ఇతర ముఖ్యులు రహస్య జీవితం ప్రారంభించ వలసివచ్చింది. రహస్యంగా ఫ్రాన్సులోనే ఉంటూ నాజీ ప్రతిఘటన ఉద్యమాన్ని నడిపారు. ప్రజలవిశ్వాసాన్ని చూరగొన్నారు. ఈ నాడు ఫ్రెంచి ప్రజలదేశ ప్రప్రధాన రాజకీయ పార్టీగా ఎన్నుకోబడ్డారు.]

నిమ్నజాతి సోదరులకు అసంతృప్తి కలగనీయం

కేంద్ర అసెంబ్లీలో సర్దార్ పటేల్

న్యూఢిల్లీ, మార్చి 11

నేడు కేంద్ర అసెంబ్లీ బడ్జెటు సమావేశములో నిమ్నజాతుల అభివృద్ధిని గురించి చర్చించేటందుకై ఒక కోత తీర్మానం ప్రవేశపెడుతూ ఎన్. శివరాజ్ ఈ విధంగా చెప్పారు:

"ఇంతకాలమూ భారతప్రభుత్వం మాకు చేసిన మేలును ప్రస్తుత ప్రభుత్వం రద్దు పరుస్తూన్నట్లు మా కులంవాళ్లు తలుస్తున్నారు. మన దేశంనుండి విదేశాలకు ఎన్నో రాయబార సంఘాలు వెడుతున్నాయి. వానిలో ఒక్కరూ నిమ్నజాతివారు లేరు. అటువంటి సంఘంలోకి తీసుకోవలసినవారికి ఉండవలసిన యోగ్యతలు అందుబాటులో లేకపోవడమే నిమ్నజాతి ప్రతినిధి దొరకకపోవడానికి కారణం. కేంద్ర ప్రభుత్వోద్యోగులలో నిమ్నజాతియుల కిచ్చిన కోటా సరిగ్గా అమలు జరుగుతున్నదీ లేనిదీ విచారించాలి. ఫెడరల్ సర్వీస్ కమిషన్ వలన మాకు న్యాయం జరగడంలేదు. గనక ఆ కమిషన్‌లో ఒక సభ్యుడు నిమ్నజాతియుడుండాలి. విద్యార్థి వేతనాల విషయంలో కేవలం కోటాతో ఆపివేయక నిమ్నజాతీయులకు ఎక్కువ వేతనాలివ్వాలి. ఇవి మీరు దయా ధర్మ భిక్షంగా ఇచ్చేదిగాదు. మాకు న్యాయంగా రావలసిన దానిని మేమడుగుతున్నాం."

తర్వాత కొంతసేపు చర్చ జరిగినాక సర్దార్ పటేల్ చర్చకు సమాధానమిస్తూ ఇల్లాగ చెప్పారు:

"విదేశీ ప్రభుత్వం నిమ్న జాతీయులకేదో చేశారను కోవడం పొరపాటు. వారు పాలించిన 200 ఏళ్ళలోనూ అస్పృశ్యతను నిషేధిస్తూ ఒక్క చట్టం చేయలేకపోయారు. దేశాలకు వెళ్ళే రాయబారవర్గాలలోకి నిమ్నజాతీయులను చేర్చడానికి ప్రయత్నిస్తున్నాము. అర్హతల మితితగ్గించడం సాధ్యం కాదు. దానివలన మన పనులు చెడతాయి. నిమ్నజాతి యువకులకు ఇస్తూన్న విద్యార్థి వేతనాలు, విదేశాలకుపోయి చదువుకొనేందుకు ఇస్తూన్న విద్యార్థి వేతనాలు తగినంతమంది అర్హులు తయారుకావడానికి సరిపడే వున్నాయి. ఉద్యోగార్హ వయస్సు నిమ్నజాతీయుల విషయంలో 3 ఏళ్ళు పొడిగించబడింది. నిమ్నజాతి వుద్యోగులను నియమించేటందుకు ఒక ప్రత్యేకసంఘాన్ని నియమించ బోతున్నాము. త్వరలోనే నిమ్నజాతులనే ప్రత్యేకత రద్దు అయ్యేటట్లు చేసి హెచ్చుతక్కువ తరగతులభేదం లేకుండా చెయ్యాలనే మా ప్రయత్నం. నిమ్నజాతులకు వట్టి న్యాయమేకాదు, వారు సందేహించడానికి అవసరం లేనట్లుగా వ్యవహారిస్తారు."

తర్వాత శివరాజ్ కోతతీర్మానాన్ని ఉపసంహరించుకొన్నారు.

చేనేత పారిశ్రామికుల నూలు నష్టయిపై కోత తీర్మానం

చేనేత పారిశ్రామికులకు, పల్లెకారులకు నూలు పంపకం సరిగ్గా జరగడంలేదనీ, నూలు తగినంత ఇవ్వడంలేదనీ చర్చించేందుకై గులాం భిక్కునారంగ్ (లీగ్) కోత తీర్మానం తెచ్చారు. నూలుమిల్లుల వుత్పత్తిలో కొంత చేనేత కార్మికులకు, పల్లెకారులకూ ప్రత్యేకించాలని క్రిందటి అసెంబ్లీలో తాను తెచ్చిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడ్డా ఆచరణలో లేదని చెప్పారు.

నూలు పంపకం చాల అవకతవకలుగా వుందనీ, ముతకనూలు కావలసినవారికి సన్ననూలు, సన్ననూలు కావలసినవారికి ముతక నూలు పంపుతున్నారనీ డి. పి. కర్మార్కర్ (కాంగ్రెస్) చాలా ఉదాహరణలు పేర్కొన్నారు. ఒక ప్రదేశాని కెక్కువ మరొకచోట తక్కువగా యిస్తున్నారనీ చెప్పారు.

చర్చ ముగియకుండానే వేళమించడంచేత నాటికి సభ ముగించారు.

Edited, Printed & Published by Katragadda Rajagopala rao at the Prajasakti Press, Mogbalrajapuram, Bezwada.

END OF ISSUE